# చాప్టర్ 7

# ఇతర కీలక ఆర్థిక సేవలు

| విషయములు | నేర్చుకునే సిలబస్ ఫలితములు |
|---|---|
| నేర్చుకునే ఉద్దేశ్యాలు | |
| పరిచయం | |
| కీలక పదాలు | |
| A ఇతర ఆర్థిక అవసరాలు | 7.2, 7.4 |
| B ఉత్పత్తుల రకాలు, వాటి లక్షణాలు మరియు ప్రయోజనాలు | 7.1, 7.3 |
| C ఆర్థిక సేవలపై పన్ను మరియు ద్రవ్యోల్బణం యొక్క ప్రభావాలు | 7.5 |
| D. అవసరాలను ప్రాధాన్యక్రమంలో గుర్తించడం,ఆర్థిక సేవలను ఆ అవసరాలకు అన్వయించడం | 7.6 |
| కీలకాంశాలు | |
| ప్రశ్నలు - సమాధానాలు | |
| స్వీయ పరీక్షా ప్రశ్నలు | |

## <u>నేర్చుకునే ఉద్దేశాలు</u>

ఈ చాప్టర్ నేర్చుకున్నాక మీరు ఈ క్రింది విషయాలపై అవగాహన పొందగలరు:

- ఒక వ్యక్తి యొక్క ఇతర ఆర్థిక అవసరాలను వివరించగలగడం;
- అందుబాటులోని ఆర్థిక ఉత్పత్తుల రకాలను వివరించగలగడం, వాటి లక్షణాలు, ప్రయోజనాల గురించి చెప్పగలగడం;
- ఆర్థిక ఉత్పత్తులపై ఉండే పన్ను ప్రభావాలను వివరించగలగడం;
- ఆర్థిక ఉత్పత్తులపై పన్ను ప్రభావాలను చెప్పగలగడం;
- క్లయింట్ అవసరాలను ప్రాధాన్య క్రమంలో గుర్తించి ఆ అవసరాలను తీర్చేందుకు ఇతర ఆర్థిక ఉత్పత్తులను అన్వయించడం.

**<u>గమనిక</u> :** ఈ చాప్టర్ లోని ప్రశ్నలకు జవాబులు చాప్టర్ చివరిలో లభిస్తాయి.

**పరిచయం**

గత రెండు చాప్టర్లలో మనం ఒక వ్యక్తికి అవసరమయ్యే జీవిత బీమా, పొదుపు/పెట్టుబడులు, వాటిని తీర్చగల ఆర్థిక ఉత్పత్తుల గురించి నేర్చుకున్నాం. ఈ చాప్టర్‌లో మనం, ఒక వ్యక్తికి అవసరమయ్యే ఇతర ఆర్థిక అవసరాల గురించి తెలుసుకుందాం.

**కీలక పదాలు :**

| ఈ చాప్టర్‌లో కింద పేర్కొన్న పదాలు, భావనల వివరణలు ఉన్నాయి: | | | |
|---|---|---|---|
| ఆరోగ్య బీమా | ఇన్సూరెన్స్ రైడర్స్ | పెన్షన్ పథకం | నగదు రహిత సౌలభ్యం |
| నో క్లెయిమ్ బోనస్ | కూడబెట్టు దశ | ధన మార్పిడి | వ్యక్తిగత ఆరోగ్య బీమా పథకం |
| ఫ్యామిలీ ఫ్లోటర్ | ఆస్పత్రిపాలైతే పొందే రోజువారి నగదు ప్రయోజన పథకం | ప్రమాద బీమా రైడర్ | తీవ్ర అనారోగ్య రైడర్ |
| టర్మ్ రైడర్ | ప్రీమియం మాఫీ రైడర్ | జీవితకాల ఫించను (యాన్యుటీ) | గ్యారెంటీ ఫించను(యాన్యుటీ) |
| పెరుగుతుండే ఫించను (యాన్యుటీ) | సంచిత దశ | అవసరాలను ప్రాధాన్యక్రమంలో గుర్తించడం | |

A. ఇతర ఆర్థిక అవసరాలు

భారత దేశంలో జీవితకాల అంచనా, ప్రస్తుతం ఉన్న రిటైర్మెంట్ వయసు 60కన్నా ఎక్కువగా ఉండటంతోపాటు క్రమంగా మెరుగుపడుతోంది. మెరుగైన వైద్య సేవల అందుబాటు, జీవన ప్రమాణాల పెరుగుదల యిందుకు కారణం. అయితే సుదీర్ఘకాలం జీవించేందుకు ఉండే అవకాశాలు కొన్ని సవాళ్లను కూడా తీసుకొస్తున్నాయి.

ఆకస్మిక మరణాలపై బీమా కంపెనీలు సంప్రదాయ బీమా సేవల (టెర్మ్, ఎండోమెంట్, మనీబ్యాక్ , యులిప్ మొదలైనవి) ద్వారా నష్టభయాన్ని ఎలా భరిస్తున్నాయో మనం చూశాం.  ఎక్కువకాలం జీవించే, నిరంతర ఆదాయం లేనటువంటి రిటైరయిన వ్యక్తుల దైనందిన ఖర్చులకు బీమా కంపెనీలు పెన్షన్/రిటైర్మెంట్ సేవల రూపంలో నష్టభయాన్ని భరిస్తున్నాయి. ఈ చాప్టర్‌లో మనం బీమా కంపెనీలు అందించే రిటైర్మెంట్ పెన్షన్ పథకాల గురించి తెలుసుకుందాం.

వ్యక్తి వయస్సు పెరిగే కొద్దీ అనారోగ్యం మరియు జబ్బులబారినపడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఎదురయ్యే వైద్య ఖర్చులను భరించేందుకు బీమా కంపెనీలు ఆరోగ్య బీమా పథకాలను అందిస్తున్నాయి. బీమా కంపెనీలు అందించే వివిధ రకాల ఆరోగ్య బీమా పథకాల గురించి మనం ఈ చాప్టర్‌లో నేర్చుకుందాం.

ముందుగా, ఈ క్రింది  ఉదాహరణను పరిశీలిద్దాం.

**ఉదాహరణ**

రాజేష్ పదవీవిరమణ పొంది తన మనుమడితో సరదాగా సమయాన్ని గడుపుతున్నారు. దురదృష్టవశాత్తూ ఏడాది క్రితం, రాజేష్ రోడ్డు ప్రమాదానికి గురై చికిత్స కోసం ఆస్పత్రిలో చేరాల్సి వచ్చింది. రిటైరయ్యేందుకు రాజేష్ పొదుపు చేసుకున్న మొత్తం  సొమ్ము ఆస్పత్రి బిల్లులకు ఖర్చు అయిపోయింది. తద్వారా రాజేష్‌కు ఉన్న ఒకేఒక్క ఆదాయ వనరును హరించేసింది. మిగిలిన జీవితమంతా రాజేష్ తన కొడుకుపై ఆధారపడేలా చేసింది.

ఆర్థిక ప్రణాళికను సిద్ధం చేసుకోవడంలో రాజేష్ ఎక్కడ, ఎలా తప్పు చేశాడు?

ఇక్కడ ప్రాథమిక అంశం ఏమిటంటే రాజేష్ ఎటువంటి ఆరోగ్య బీమాను ఎంపిక చేసుకోలేదు. ఒకవేళ ఆయన ఆరోగ్య బీమా పథకం తీసుకొని ఉంటే, ఆయన ఆస్పత్రి ఖర్చులను ఆ పథకం చూసుకునేది. పైగా, తన వద్ద ఉన్న కొద్దిపాటి సొమ్మును కూడా రాజేష్ స్థిరమైన ఆదాయం పొందేందుకు పెన్షన్ పథకంలో కాకుండా బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు.

ఈ సెక్షన్‌లో మనం వివిధ ఆరోగ్య బీమా పథకాలు మరియు రిటైర్‌మెంట్ పథకాల లక్షణాలు మరియు ప్రయోజనాల గురించి తెలుసుకుందాం.

## A1 ఆరోగ్య బీమా ఆవశ్యకత

ఇంతకుముందే చర్చించినట్లు, భారతదేశంలో గత కొన్ని సంవత్సరాలలో వైద్య సేవలు మెరుగుపడ్డాయి. అయితే, ఈ సేవలు అందుబాటులోకి వచ్చినా ఇటీవలికాలంలో వైద్య ఖర్చులు భారీగా పెరిగాయి. ప్రస్తుతం మేజర్ ఆపరేషన్ లేదా సుదీర్ఘకాలం ఆస్పత్రిలో చికిత్స పొందడం ఖరీదైన వ్యవహారంగా మారింది. ఒకవైపు జీవితకాల అంచనా పెరగడం, మరోవైపు అనారోగ్యం, జబ్బులబారినపడే అవకాశాలు పెరగడం గతంలోకన్నా ఆరోగ్య బీమా యొక్క ఆవశ్యకతను పెంచాయి. ఒకవేళ ఒక వ్యక్తి ఆస్పత్రిపాలైతే చెల్లించాల్సి వచ్చే ఖర్చులను ఆరోగ్య బీమా పథకం చెల్లిస్తుంది. డాక్టర్ల ఫీజులు, గది అద్దె, మందులు, ఇతర ఖర్చుల లాంటి వాటికి ఈ ఆరోగ్య బీమా పథకం వర్తిస్తుంది.

ఈ క్రింద కారణాల దృష్ట్యా ఆరోగ్య బీమా (దీనిసే వైద్య బీమా లేదా మెడిక్లెయిమ్ అంటారు) అవసరం.

జీవితం అనిశ్చితమైనది. జీవితాంతం ఒక వ్యక్తి ఎల్లప్పుడూ ఆరోగ్యంగా మరియు దృఢంగా జీవించలేడు. అందుకే జీవితంలోని ప్రతి అంకంలోనూ ఆరోగ్య బీమా ఉండటం అవసరం.

గత కొన్నేళ్లుగా ఆరోగ్యసేవల ఖర్చులు భారీగా పెరిగాయి. ఒకవేళ గుండెపోటు, క్యాన్సర్ లేదా మధుమేహం వంటి పెద్ద అనారోగ్యం వస్తే అందుకు వెంటనే నిధులను సమకూర్చడం కష్టం. ఈ పరిస్థితి మరణానికి దారితీయవచ్చు. ఒకవేళ ఈ వైద్య ఖర్చుల కోసం కుటుంబం, వ్యక్తిగత రుణాలు తీసుకొని చికిత్స చేయించినా ఆ వ్యక్తి ప్రాణం నిలవకపోతే ఆ కుటుంబంపై మోయలేని ఆర్థికభారం పడుతుంది. ఆరోగ్య బీమా ఉంటే ఈ సమస్యను ఎదుర్కోనడంలో దోహదపడుతుంది.

ఆరోగ్య బీమా తీసుకునేటప్పుడు వ్యక్తి వయసు ఎంతో ముఖ్యం. వయస్సు ఎక్కువగా ఉన్న కొద్దీ ప్రీమియం కూడా అధికంగా ఉంటుంది. ఈ పథకాలన్నీ ఏటా పునరుద్ధరించుకునే పథకాలు కావడంతో వయస్సు పెరిగేకొద్దీ పాలసీ వ్యయం పెరుగుతుంది. క్లెయిమ్‌ల అనుభవంపై కూడా ఇది ఆధారపడి ఉంటుంది.

**<u>గమనించ వలసిన విషయం:</u>**

ఆరోగ్య బీమా పథకాలు ఏమి అందిస్తాయో మరియు ఏమి అందించవో ముందే స్పష్టంగా వివరిస్తాయి. అందువల్ల పాలసీలోని పదాలను జాగ్రత్తగా అర్థంచేసుకోవడం ఎంతో అవసరం.

**<u>అవగాహన పెంచుకునేందుకు చేయవలసిన పని</u> :**

మీ కుటుంబ సభ్యులు లేదా స్నేహితులెవరైనా ఆరోగ్య బీమా తీసుకున్నారా? వారు తీసుకున్న ఆరోగ్య బీమా పథకంలోని లక్షణాలు మరియు ప్రయోజనాలను గుర్తించండి.

## A2. ఇన్సూరెన్స్ రైడర్స్ యొక్క అవసరం

బీమా పథకాలకు జోడించి, జారీచేయబడే అదనపు ప్రయోజనాలే రైడర్స్. రైడర్ అంటే మూల పథకానికి అదనపు ప్రీమియం చెల్లించడం ద్వారా జోడించే షరతు లేదా నిబంధన. అంటే అదనపు ప్రయోజనం = అదనపు ప్రీమియం అన్నమాట. ఒకవేళ మూల పథకంలో పాలసీదారుడు కోరుకున్న ఏదైనా లక్షణం లేకపోతే రైడర్(ఒకవేళ ఉంటే) ద్వారా దాన్ని ఆ పథకంలో జోడించవచ్చు.

వివిధ రకాల పుల్లల పై ఉండే ఐస్ క్రీముల రుచులు ఎలా ఉంటాయో రైడర్స్ విధానాన్ని ఒక రకంగా ఆ ఉదాహరణతో పోలుస్తూ చెప్పవచ్చు. ఇక్కడ పాలసీదారుడు తీసుకునే మూల బీమా పథకం పుల్ల ఐస్‌లాంటిది. పుల్లఐస్‌పై రుచులను ఎలా ఎంపిక చేసుకోవచ్చో పాలసీదారుడు కూడా పథకంపై అదనపు లక్షణాల కోసం రైడర్స్ ను ఎంపిక చేసుకోవచ్చు.

ఎలాంటి పథకంపై ఎటువంటి రైడర్స్ అందుబాటులో ఉన్నాయో చాలా బీమా కంపెనీలు బ్రోచర్లలో తెలియజేస్తాయి. పాలసీదారుడి అవసరాలకు తగ్గట్లుగా మూల పథకంలో మార్పులకు రైడర్స్ అవకాశం కల్పిస్తాయి. దీని వల్ల వివిధ రకాల బీమా పథకాలను కొనుగోలు చేసే బాధ తప్పుతుంది. రైడర్స్ పై మరిన్ని వివరాలకు సెక్షన్ బి3 చూడండి.

## A3 పెన్షన్ పథకాల అవసరం

జీవితకాల అంచనా క్రమంగా పెరుగుతుండటం వల్ల ఒక వ్యక్తి ఉద్యోగం చేసే కాలంలో పొదుపు చేయడం ఎంతో అవసరం. దీనివల్ల రిటైరయ్యాక నెలవారీ స్థిరమైన ఆదాయం లేని సమయంలో కూడా ఒకే రకమైన జీవితాన్ని గడిపేందుకు అవకాశం లభిస్తుంది.

రిటైర్‌మెంట్ జీవితాన్ని శాంతి, సౌఖ్యాలతో గడపాలనుకునే వారెవరికైనా పదవీవిరమణ పథకం ఎంతో అవసరం.

ఉద్యోగం చేసే సమయంలో ఒక వ్యక్తి తన రిటైర్‌మెంట్ అవసరాల కోసం పదవీవిరమణ పథకం తీసుకొని చిన్నమొత్తాల్లో నెలవారీ చెల్లింపులు చేసేందుకు వీలవుతుంది. రిటైర్‌మెంట్ వయసు వచ్చేసరికి ఈ రకంగా కూడబెట్టిన సొమ్ము భారీ మొత్తంగా మారి పెన్షన్ పథకం కొనుగోలు చేసేందుకు దోహదపడుతుంది.

**అవగాహన పెంచుకునేందుకు చేయ వలసిన పని :**

మీ తల్లిదండ్రులు (ఒకవేళ రిటైరై ఉంటే) లేదా అమ్మమ్మ/బామ్మ, తాతయ్యలు వారి ఉద్యోగ సమయాల్లో పదవీవిరమణ కోసం ఏదైనా పెట్టుబడి పెట్టారేమో అడగండి.

## B ఉత్పత్తులలో రకాలు, వాటి లక్షణాలు మరియు ప్రయోజనాలు

## బి1 ఆరోగ్య బీమాపథకాలలోని రకాలు

బీమా మార్కెట్‌లో సాధారణంగా నాలుగు రకాల ఆరోగ్య బీమా పథకాలు అందుబాటులో ఉన్నాయి. వానిలో ఒక్కోదాన్ని పరిశీలిద్దాం.

## B1 A వ్యక్తిగత ఆరోగ్య బీమా పథకం

పేరు సూచించినట్లుగానే ఈ పథకం కేవలం ఒక వ్యక్తి ఆరోగ్య అవసరాలకు ఆరోగ్య భద్రత కల్పిస్తుంది.

**ఉదాహరణ**

అజయ్ మరియు టీనా పెళ్లయిన జంట. పెళ్లికాక ముందు అజయ్, టీనాలు వ్యక్తిగత ఆరోగ్య బీమాపథకాల క్రింద ఏబీసీ కంపెనీ నుంచి వేర్వేరుగా చెరో రూ. 1,00,000కు ఆరోగ్య బీమా భద్రత పొందారు.

## B1 B ఫ్యామిలీ ఫ్లోటర్ ఆరోగ్య బీమా పథకం

ఫ్యామిలీ ఫ్లోటర్ పథకం వ్యక్తిగత ఆరోగ్య పథకానికి భిన్నంగా ఉంటుంది. ఈ పథకంలో కుటుంబ సభ్యులంతా భద్రత పొందవచ్చు. భార్యభర్తలతోపాటు వారి పిల్లలు మరియు తల్లిదండ్రులు కూడా ఈ పథకం క్రింద బీమా భద్రత

తీసుకోవచ్చు. ఈ పథకం కింద ఎంత మంది వ్యక్తులు ఉండవచ్చో బీమా కంపెనీ తెలియజేస్తుంది. ఈ పథకంలో బీమా భద్రత ఎటువంటి స్థిరమైన నిష్పత్తి లేకుండా కుటుంబ సభ్యులందరిపై కలిపి ఉంటుంది.

**ఉదాహరణ**

అజయ్ మరియు టీనా పెళ్లయిన జంట. వారిద్దరూ కలిసి రూ. 2,00,000లకు ఫ్యామిలీ ఫ్లోటర్ ఆరోగ్య బీమా పథకం కొనుగోలు చేశారు. ఎటువంటి స్థిరమైన నిష్పత్తి అవసరంలేని ఈ పథకం క్రింద అజయ్ లేదా టీనా ఆస్పత్రిపాలైనా లేదా ఇద్దరూ ఆస్పత్రిలో చేరినా గరిష్టంగా రూ. 2,00,000 చెల్లింపు లభిస్తుంది.

## B1 C సామూహిక ఆరోగ్య బీమా పథకం

ఉమ్మడి లక్ష్యంతో ఒకే బృందం పేరిట ఏర్పడే వ్యక్తులకు ఈ బీమా పథకం భద్రత కల్పిస్తుంది. ఉదాహరణకు, ఒక కంపెనీలోని ఉద్యోగులు అందరూ ఈ బృందంలో ఉండవచ్చు. అత్యవసర వైద్య అవసరాల నుండి తమ సిబ్బందిని కాపాడేందుకు చాలా యాజమాన్యాలు ఆరోగ్య బీమా కల్పిస్తాయి. మరికొన్ని కంపెనీలు ఉద్యోగుల కుటుంబ సభ్యులకు కూడా ఈ బీమా వర్తింపజేస్తాయి.

**ఉదాహరణ**

అజయ్ ఒక ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్నాడు. సంస్థలోని ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు ఆ కంపెనీ సామూహిక ఆరోగ్య బీమా భద్రత కల్పిస్తోంది. అందువల్ల అజయ్ ఈ పథకంలో తన భార్య టీనాను కూడా చేర్చవచ్చు.

## B1 D ఆస్పత్రిపాలైతే రోజువారి నగదు ప్రయోజన పథకం

ఈ పథకంలో చేరిన పాలసీదారుడు ఒకవేళ ఆస్పత్రిపాలైతే బీమా కంపెనీ ఆ వ్యక్తికి స్థిరమైన రోజువారి నగదును చెల్లిస్తుంది. వైద్య అవసరాలకు ఎంత ఖర్చు అయిందనే దానితో నిమిత్తం లేకుండా పాలసీ తీసుకున్నప్పుడు అంగీకరించిన మేరకు ఆస్పత్రిలో చేరినన్ని రోజులకు స్థిరమైన మొత్తాన్ని చెల్లిస్తుంది. రోజువారి మొత్తం స్థిరంగా ఉండటంతోపాటు వాస్తవ చికిత్స ఖర్చులకన్నా ఎక్కువగా లేదా తక్కువగా ఉండవచ్చు.

ఒకవేళ పాలసీదారుడు ఇంటెన్సివ్ కేర్ యూనిట్ (ఐసీయూ)లో చేరితే బీమా కంపెనీ కొంత అదనపు మొత్తాన్ని రోజువారి నగదు చెల్లింపు క్రింద అందజేయవచ్చు. తీవ్ర అనారోగ్యం లేదా సర్జరీ చేయాల్సి వచ్చే పరిస్థితుల్లో బీమా కంపెనీ కొన్ని నియమనిబంధనలకు అనుగుణంగా కొంత మొత్తాన్ని ఒకేసారి చెల్లిస్తుంది. ఈ పథకం క్రింద అందే

రోజువారి నగదు ప్రయోజనం పాలసీదారుడు తీసుకునే ఇతర ఆరోగ్య బీమా పథకాలకు అదనంగా ఉంటుంది. ఈ పథకంలో రోజువారి నగదు ప్రయోజనం పొందేందుకు ఏడాదిలో కొన్ని రోజుల పరిమితి ఉంటుంది. పాలసీ నియమ నిబంధనల్లో దీన్ని ప్రస్తావిస్తారు.

**ఉదాహరణ**

ఈ క్రింద పేర్కొన్న మొత్తాలు కేవలం ఉదాహరణలు మాత్రమే. ఆస్పత్రిపాలైతే అందే రోజువారి నగదు ప్రయోజనాలు వివిధ బీమా కంపెనీలలో భిన్నంగా ఉంటాయి.

అజయ్ ఒక ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్నాడు. ఆ కంపెనీ తన ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు సామూహిక ఆరోగ్య బీమా పథకాన్ని కల్పిస్తోంది. అజయ్ తన భార్య టీనాను కూడా ఈ పథకంలో చేర్చవచ్చు. అయితే కంపెనీ అందించే బీమా భద్రత తక్కువగా ఉందని భావించిన అజయ్ ప్రస్తుత పథకానికితోడు ఆస్పత్రిపాలైతే అందే రోజువారి నగదు చెల్లింపు పథకాన్ని తీసుకున్నాడు.

అజయ్ తీసుకున్న ఈ పథకం క్రింద ఆస్పత్రిలో చేరాల్సి వస్తే, వైద్య ఖర్చుల నిమిత్తం రోజుకు రూ. 2,000 అందుతాయి. అలాగే ఒకవేళ అజయ్ ఐసీయూలో చేరితే రోజుకు రూ. 2,000 చొప్పున అదనపు మొత్తాన్ని అందించేలా బీమా కంపెనీ పాలసీలో పేర్కొంది. అయితే రోజువారి ఆస్పత్రి ఖర్చుల వార్షిక పరిమితి రూ. 1,20,000గానూ, ఐసీయూలో చేరితే అందే రోజువారి ఖర్చుల వార్షిక పరిమితి మరో రూ. 1,20,000గానూ ఉన్నట్లు బీమా కంపెనీ తెలిపింది. దీని ప్రకారం అజయ్ ఒక ఏడాదిలో గరిష్టంగా 60 రోజులకు పరిహారం పొందవచ్చు. అలాగే అజయ్ ఒకవేళ తీవ్ర అనారోగ్యానికి గురైతే ఈ పథకం క్రింద బీమా కంపెనీ రూ. 50,000 అదనపు మొత్తాన్ని కూడా చెల్లిస్తుంది.

అజయ్ ఆస్పత్రిపాలైతే చెల్సించాల్సి వచ్చే వాస్తవ ఖర్చులతో నిమిత్తం లేకుండా బీమా కంపెనీ పైన చెప్పిన స్థిర చెల్లింపులు చేస్తుంది. ఇది అజయ్ పేరిట అతను పనిచేస్తున్న కంపెనీ తీసుకున్న ఆరోగ్య బీమాకు అదనం.

## B2 ఆరోగ్య పథకాల లక్షణాలు మరియు ప్రయోజనాలు

ఆరోగ్య బీమా పథకాలు భిన్నమైన లక్షణాలు మరియు ప్రయోజనాలను కలిగి ఉంటాయి. వాటిలో కొన్నింటికి ఈ లక్షణాలు ఉంటాయి:

1. ధర: ఆరోగ్య బీమా పథకంలో చెల్లించే ప్రీమియం పాలసీదారుడి వయస్సు, ఆరోగ్యం, అలవాట్లు, కుటుంబ ఆరోగ్య చరిత్ర తదితర అంశాలపై ఆధారపడి ఉంటుంది. ఒకవేళ ఇతర కారణాలన్నీ స్థిరంగా ఉంటే, పాలసీదారుడి వయసు పెరిగే కొద్దీ ప్రీమియం మొత్తం కూడా పెరుగుతుంది. అందువల్ల వీలైనంత చిన్న వయస్సులోనే ఆరోగ్య బీమా పథకం తీసుకోవడం మంచిది. ఎందుకంటే తొలినాళ్లలో ప్రీమియం ఎక్కువగా లేకపోయినా పాలసీదారుడి వయస్సు పెరిగేకొద్దీ ప్రీమియం పెరుగుతుంది.

**<u>ఉదాహరణ</u>**

కరణ్ రూ. 7,000 వార్షిక ప్రీమియం చెల్లించి రూ. 3,00,000లకు ఆరోగ్య బీమా పథకం తీసుకున్నాడు. కరణ్ తీవ్ర గుండెపోటుకు గురై ఆపరేషన్ చేయించుకోవాల్సి వచ్చింది. ఆస్పత్రి ఖర్చులు రూ. 2,50,000లను బీమా కంపెనీ చెల్లించింది. ఇక్కడ కరణ్ చెల్లించిన రూ. 7,000 వార్షిక ప్రీమియం అతను పొందిన ఆర్థిక ప్రయోజనంతో పోలిస్తే పరిగణనలోకి తీసుకోవాల్సిన మొత్తం కాదు.

2. నగదు రహిత సౌలభ్యం: కొన్ని బీమా పథకాలు నగదు రహిత సౌలభ్యాన్ని అందిస్తాయి. ఈ పథకాల కింద బీమా పొందే పాలసీదారుడికి ఫొటో గుర్తింపు కార్డు ఇస్తారు. నెట్‌వర్క్ ఆస్పత్రిలో చేరేటప్పుడు పాలసీదారుడు ఈ సమాచారాన్ని ఆరోగ్య బీమా కంపెనీకి అందించాలి. ఆ ఆసుపత్రులు పాలసీదారుడికి వైద్య సేవలు అందించేందుకు ఆరోగ్య బీమా కంపెనీతో కాంట్రాక్టు కుదర్చుకున్న గ్రూప్ ఆస్పత్రులు . ఇందులో చేరేందుకు ఆమోదం లభించాక పాలసీదారుడు డిపాజిట్ మొత్తం లేదా వైద్య ఖర్చులను చెల్లించక్కర్లేదు. పాలసీలోని నియమ నిబంధనల ప్రకారం ఖర్చుల లెక్కలన్నింటినీ గ్రూప్ ఆస్పత్రులు ఆరోగ్య బీమా కంపెనీతో పరిష్కరించుకుంటాయి.

**<u>గమనించ వలసిన అంశం</u> :**

అన్ని ఖర్చులను బీమా కంపెనీ భరించదు. బీమా ప్రయోజనం వర్తించని కొన్ని ఖర్చులు కూడా ఉంటాయి. ఇవి ఆయా బీమా కంపెనీలలో వేరువేరుగా ఉంటాయి.

పాలసీదారుడు ఒకవేళ గ్రూప్ ఆస్పత్రికి చెందని ఆస్పత్రిలో చేరితే, వైద్య ఖర్చులను తొలుత అతనే చెల్లించాల్సి ఉంటుంది. పిదప ఆ మొత్తాన్ని పాలసీ నియమ నిబంధనలకు అనుగుణంగా బీమా కంపెనీ చెల్లిస్తుంది.

3. వైద్య పరీక్షలు: పాలసీదారుడు పాలసీ తీసుకునే ముందు తప్పనిసరిగా వైద్య పరీక్షలు చేయించుకోవాలని చాలా ఆరోగ్య బీమా కంపెనీలు సూచిస్తాయి. డాక్టర్ అందించే వైద్య పరీక్షల నివేదిక ఆధారంగా పాలసీతీసుకునే వ్యక్తికి ఆ పాలసీని జారీ చేయాలా లేదా అనే విషయాన్ని బీమా కంపెనీలు నిర్ణయిస్తాయి.

4. పాలసీ తీసుకోవడానికి ముందున్న అనారోగ్యాలు: పాలసీదారుడు బీమా తీసుకునే ముందు ఉన్న అనారోగ్యాలపై, చాలా బీమా కంపెనీలు కొంత కాలం తర్వాత బీమా అందిస్తాయి. దీన్నే 'నిరీక్షణ కాలం' అంటారు. కొన్ని బీమా కంపెనీలు పాలసీకి ముందు ఉండే అనారోగ్యాలపై ఎటువంటి బీమా కల్పించవు. అయితే ఈ విషయాన్ని పాలసీ నియమ నిబంధనల్లో స్పష్టంగా తెలియజేస్తాయి. ఉదాహరణకు పాలసీ తీసుకునే నాటికి ఉండే మధుమేహం వంటి అనారోగ్యాలపై బీమా కంపెనీలు మూడు, నాలుగేళ్ల తర్వాత మాత్రమే భద్రతను కల్పిస్తాయి. పాలసీకి ముందు ఉండే అనారోగ్యాలకు అందించే చికిత్సలపై నియమ నిబంధనలు ప్రతీ కంపెనీకి వేర్వేరుగా ఉంటాయి.

5. నో క్లెయిమ్ బోనస్: పాలసీని పునరుద్ధరించే సమయానికి ఎటువంటి క్లెయిమ్ లేకపోతే బీమా కంపెనీ 'నో క్లెయిమ్ బోనస్' ఇచ్చే అవకాశం ఉంది. అంటే తదుపరి ఏడాది ప్రీమియంపై బీమా కంపెనీ డిస్కౌంట్ ఇస్తుంది.

6. శాశ్వత మినహాయింపులు: బీమా కంపెనీలు ఆరోగ్య బీమా పాలసీలలో కొన్ని శాశ్వత మినహాయింపులు చేస్తాయి. ఉదాహరణకు మందులను సరిగా వాడకపోవడం లేదా వైద్యుల సూచనలు పాటించకపోవడం లాంటివి.

7. తక్షణ వైద్యం: పాలసీదారుడికి అనువైన సమయంలో తక్షణ వైద్య సాయం అందుతుంది. పాలసీదారుడు వైద్యుల అపాయింట్‌మెంట్ కోసం నిరీక్షించాల్సిన పని ఉండదు.

8. పొదుపు లేదా రుణాల నుంచి భారీ మొత్తాలు తీసుకోనక్కర్లేదు: వైద్య ఖర్చులకు సొమ్ములు ఎలా సమకూర్చాలని పాలసీదారుడు ఆందోళన చెందాల్సిన అవసరంలేదు. ఎందుకనగా, ముందే చెల్లించిన ప్రీమియంల వల్ల బీమా కంపెనీ ఆ ఖర్చుల మొత్తాన్ని చెల్లిస్తుంది.

**ప్రశ్న 7.1**

ఆరోగ్య బీమా పథకాల లక్షణాలు మరియు ప్రయోజనాలు తెలపండి

## B3 రైడర్స్

సెక్షన్  ఎ2లో చర్చించినట్లుగా, పాలసీదారులు కొంత అదనపు సొమ్ము చెల్లించడం ద్వారా పాలసీలోని రైడర్స్ అదనపు ప్రయోజనాలు కల్పిస్తాయి. ఈ సెక్షన్‌లో మనం కొన్ని రైడర్స్ కు చెందిన ఉదాహరణలు చూద్దాం.

## B3 A ప్రమాదంలో కలిగే మరణంపై ఎడిబి రైడర్:

పాలసీదారుడు ఒకవేళ ప్రమాదంలో మరణిస్తే సాధారణ బీమా మొత్తానికి అదనంగా మరికొంత మొత్తాన్ని ఈ రైడర్ అందిస్తుంది. అయితే పాలసీదారుడి మరణం ప్రమాదం వల్ల సంభవించి ఉండాలి. పాలసీలో పేర్కొన్న నియమ నిబంధనలకు అనుగుణంగా ఈ రైడర్‌లోని చెల్లింపు ఉంటుంది.

భారతదేశంలో ప్రమాదాల్లో మరణిస్తున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్న దృష్ట్యా, ఇక్కడ ఎడిబి రైడర్‌కు ఎంతో ప్రాముఖ్యత ఉంది. ఎటువంటి పాలసీలపై ఈ రైడర్ తీసుకోవచ్చో బీమా కంపెనీ ముందుగా తెలియజేస్తుంది. అలాగే ఈ రైడర్ ప్రయోజనం వర్తించని మినహాయింపుల జాబితాను కూడా అందిస్తుంది.

### ఉదాహరణ

ఏబీసీ బీమా కంపెనీ నుంచి రూ. 25,00,000లకు టర్మ్ బీమా పాలసీ తీసుకోవాలని మహేష్ భావించాడు. ఈ పథకంలో ఏడీబీ రైడర్‌ను కూడా చేర్చుకోవాలని అనుకున్నాడు.

అయితే, ఎడిబి రైడర్ పొందాలంటే, ఏబీసీ బీమా కంపెనీ ఈ క్రింది నియమ నిబంధనలను పేర్కొంది.

కనీస ప్రవేశ వయసు 15 ఏళ్లు

గరిష్ట ప్రవేశ వయసు 55 ఏళ్లు

మెచ్యూరిటీపై గరిష్ట వయసు 60 ఏళ్లు

కనీస బీమా మొత్తం రూ. 50,000

గరిష్ట బీమా మొత్తం రూ. 10,00,000 లేదా మూల బీమాలో ఏది తక్కువైతే అది.

ప్రమాదం జరిగిన 180 రోజుల్లోగా మరణం సంభవించాలి

పైన పేర్కొన్న నియమ నిబంధనల విశ్లేషణ:

మహేష్ 15 సంవత్సరాల వయస్సు తర్వాత మాత్రమే ఈ రైడర్‌ను తీసుకోగలడు. 55 సంవత్సరాల తర్వాత తీసుకోవడం సాధ్యపడదు.

మహేష్‌కు 60 సంవత్సరాలు నిండితే మూల పాలసీ కొనసాగినా ఈ రైడర్ మాత్రం దానంతట అదే రద్దవుతుంది.

రూ. 50 వేలకన్నా తక్కువ మొత్తంపై మహేష్ ఈ రైడర్‌ను తీసుకోలేడు.

మహేష్ గరిష్టంగా రూ. 10,00,000ల వరకూ లేదా మూల పాలసీలో (ఈ కేసులో మూల పాలసీ రూ. 25,00,000) ఏది తక్కువ అయితే దానిపై ఈ రైడర్‌ను తీసుకోవచ్చు. అంటే ఈ కేసులో మహేష్ రూ. 10,00,000ల గరిష్ట మొత్తంపై ఏడీబీ రైడర్ తీసుకోవచ్చు.

మహేష్ ఒకవేళ ప్రమాదానికి గురై తొమ్మిది నెలలపాటు ఆస్పత్రిలో చికిత్స పొంది మరణిస్తే, అతని నామినీకి బీమా కంపెనీ ఎడిబి రైడర్ యొక్క ప్రయోజనాన్ని అందించదు. కేవలం మూల పాలసీ మొత్తాన్ని మాత్రమే చెల్లిస్తుంది. ఏడీబీ రైడర్ క్రింద ప్రయోజనం పొందాలంటే ప్రమాదం జరిగిన 180 రోజుల్లోగా పాలసీదారుడి మరణం సంభవించాలి.

ఇది కేవలం ఒక బీమా కంపెనీ ఉదాహరణ మాత్రమే. ఏడీబీ రైడర్‌పై నియమ నిబంధనలు కంపెనీల మధ్య వేర్వేరుగా ఉంటాయి.

## B3 B టర్మ్ రైడర్

బీమా పాలసీపై అందే డెత్ కవర్ సొమ్మును పెంచుకునేందుకు ఈ రైడర్ ఉపయోగపడుతుంది. ఒక వ్యక్తి పొదుపు పాలసీ వంటి ఎండోమెంట్ పథకం లేదా మనీబ్యాక్ పథకం తీసుకోవడంతోపాటు ప్రత్యేక టర్మ్ బీమా పథకం తీసుకోకుండానే డెత్ కవర్‌ను పెంచుకోవాలంటే ఈ రైడర్‌ను ఎంపిక చేసుకోవచ్చు.

ఎటువంటి పథకాలపై ఈ రైడర్‌ను తీసుకోవచ్చో బీమా కంపెనీ తెలియజేస్తుంది. అలాగే ఈ రైడర్ క్రింద సొమ్ము చెల్లించడం వీలుకాని మినహాయింపుల జాబితాను కూడా అందిస్తుంది.

**ఉదాహరణ**

మహేష్ తన కొడుకు యొక్క చదువు కోసం 20 ఏళ్లకు రూ. 25,00,000ల ఎండోమెంట్ పథకం తీసుకోవాలనుకున్నాడు. అదే సమయంలో ప్రత్యేక టర్మ్ బీమా రైడర్ ద్వారా రూ. 10,00,000ల అదనపు బీమా పొందాలనుకున్నాడు. కాబట్టి ఈ ఉదాహరణలో మహేష్ రూ. 25,00,000ల ఎండోమెంట్ మూల పాలసీతోపాటు రూ. 10,00,000ల టర్మ్ బీమా రైడర్‌ను అదనంగా చేర్చుకోవచ్చు.

అయితే టర్మ్ బీమా రైడర్‌ను పొందేందుకు బీమా కంపెనీలు ఈ క్రింది నియమ నిబంధనలను పేర్కొన్నాయి:

కనీస ప్రవేశ వయస్సు 15 ఏళ్లు

గరిష్ట ప్రవేశ వయస్సు 55 ఏళ్లు

మెట్యూరిటీపై గరిష్ట వయస్సు 60 ఏళ్లు

కనీస బీమా మొత్తం రూ. 50 వేలు

గరిష్ట బీమా మొత్తం, మూల మొత్తానికి సమానంగా

పైన పేర్కొన్న నియమ నిబంధనల విశ్లేషణ:

మహేష్ 15 సంవత్సరాల వయస్సు తర్వాత మాత్రమే ఈ రైడర్‌ను తీసుకోగలడు. 55 సంవత్సరాల తర్వాత తీసుకోవడం సాధ్యపడదు.

మహేష్‌కు 60 సంవత్సరాలు నిండితే మూల పాలసీ కొనసాగినా ఈ రైడర్ మాత్రం దానంతట అదే రద్దవుతుంది.

రూ. 50 వేలకన్నా తక్కువ మొత్తంపై మహేష్ ఈ రైడర్‌ను తీసుకోలేడు.


మహేష్ గరిష్టంగా మూల పాలసీ (ఈ కేసులో రూ. 25,00,000)తో సమానమైన మొత్తానికి ఈ రైడర్‌ను ఎంపిక చేసుకోవచ్చు. అంటే, మహేష్ గరిష్టంగా రూ. 25,00,000 వరకూ టర్మ్ రైడర్‌ను ఎంపిక చేసుకోవచ్చు. కానీ ఇక్కడ అతని అవసరం కేవలం రూ. 10,00,000లు మాత్రమే.

మహేష్ ఒకవేళ పాలసీ గడువులోగా మరణిస్తే అప్పుడు అతని నామినీ/లబ్దిదారునకు రూ. 25,00,000 మూల పాలసీ మొత్తంతోపాటు రూ. 10,00,000ల టర్మ్ రైడర్ మొత్తం కూడా బీమా కంపెనీ నియమ నిబంధనల మేరకు అందిస్తుంది.

ఇది కేవలం ఒక బీమా కంపెనీ యొక్క ఉదాహరణ మాత్రమేనని గుర్తుంచుకోండి. టర్మ్ రైడర్‌పై వివిధ బీమా కంపెనీల మధ్య నియమ నిబంధనలు వేర్వేరుగా ఉంటాయి.

## B3 C తీవ్రమైన అనారోగ్యాన్ని (వ్యాధుల్ని) కవరు చేయడానికి రైడర్స్

పాలసీదారుడికి నిర్ధారించబడిన తీవ్ర అనారోగ్యంపై నిర్ణీత సొమ్మును ఈ రైడర్ అందిస్తుంది. ఈ సొమ్మును వైద్య ఖర్చుల చెల్లింపు, ఆస్పత్రిలో చేర్చేందుకు అయ్యే ఫీజు లేదా అనారోగ్యాన్ని గుర్తించేందుకు జరిపే వైద్య పరీక్షల ఖర్చుకు ఉపయోగించుకోవచ్చు. అయితే ఈ రైడర్ సొమ్మును పొందాలంటే బీమా కంపెనీ రూపొందించే తీవ్ర అనారోగ్యం (సీఐ) జబ్బుల జాబితాలో ఆ అనారోగ్యం ఉండాలి. బీమా కంపెనీల మధ్య ఈ జాబితాలో తేడాలు ఉండే అవకాశం ఉంది.




ఈ రైడర్‌ను పొందేందుకు ఉండాల్సిన కనీస, గరిష్ట వయస్సు, పాలసీ మెచ్యూరిటీ పొందేందుకు గరిష్ట వయసు, కనీస, గరిష్ట బీమా మొత్తాల గురించి బీమా కంపెనీలు తెలియజేస్తాయి. బీమా కంపెనీల మధ్య ఈ రైడర్ మొత్తాల్లో తేడాలు

ఉంటాయి. ఈ రైడర్‌కు సంబంధించిన ఇతర నియమ, నిబంధనలను కూడా బీమా కంపెనీ ముందే తెలియజేసే అవకాశం ఉంది. ఎలాంటి పథకాలపై ఈ రైడర్‌ను తీసుకోవచ్చో బీమా కంపెనీ ముందే తెలియజేస్తుంది. అలాగే ఈ రైడర్ వర్తించని మినహాయింపుల జాబితాను కూడా పేర్కొంటుంది.

**గమనిచ వలసిన అంశం**

పాలసీదారుడు తీవ్ర అనారోగ్యం (సీఐ)తో బాధపడుతున్నట్లు నిర్ధారణ కాగానే సాధారణంగా ఈ రైడర్ కింద బీమా కంపెనీలు భారీ మొత్తాలు చెల్లిస్తాయి. దీంతో ఈ రైడర్ అందించే ప్రయోజనం అక్కడితో ముగుస్తుంది. అందువల్ల భవిష్యత్తు క్లెయిమ్‌లను బీమా కంపెనీలు అంగీకరించవు.

**ప్రశ్న 7.2**

సాధారణంగా సీఐ రైడర్ పరిధిలోకి వచ్చే ఐదు తీవ్ర అనారోగ్యాల పేర్లను తెలపండి.

## B3 D ప్రీమియం మాఫీ ( వెయివర్ ఆఫ్ ప్రీమియం) రైడర్

పాలసీదారుడు అనారోగ్యం వల్ల వైకల్యానికి గురయినా లేదా ప్రమాదం కారణంగా ఆదాయం కోల్పోయినా, ఈ రైడర్ భవిష్యత్తు ప్రీమియాలను రద్దు చేస్తుంది. బీమా కంపెనీ పాలసీదారుడి తరఫున ప్రీమియములను చెల్లిస్తుంది. పాలసీ కూడా సాధారణంగా కొనసాగుతూనే ఉంటుంది.

అంగ వైకల్యం వల్ల పాలసీదారుడు ప్రీమియములను చెల్లించలేకపోయినా ఈ రైడర్ పాలసీ ల్యాప్సు కాకుండా ఉంచేందుకు ఎంతో ఉపయోగపడుతుంది.

కొన్ని పిల్లల పథకాల్లో డబ్ల్యూఓపీ రైడర్ పాలసీలోనే ఉంటుంది. ఇతర పథకాల్లో ఐచ్ఛికంగా ఉంటుంది. ప్రీమియం చెల్లించే తల్లిదండ్రుల్లో ఒకరికి మరణం సంభవించినా పాలసీ కొనసాగేలా డబ్ల్యూఓపీ రైడర్ చూస్తుంది. తద్వారా పిల్లల భవిష్యత్తు అవసరాలకు ఇబ్బందిరాకుండా కాపాడుతుంది. ఇలాంటి కేసుల్లో పాలసీ నియమాల ప్రకారం పిల్లలకు నిర్దేశిత లబ్ధి అందే వరకూ ప్రీమియంను మాఫీ చేస్తారు.

డబ్ల్యూఓపీ వర్తించే రైడర్‌పై బీమా కంపెనీలు కనీస ప్రవేశ వయస్సు, గరిష్ట మెచ్యూరిటీ వయస్సు మరియు కనిష్ట, గరిష్ట బీమా మొత్తాలను నిర్ణయిస్తాయి. బీమా కంపెనీల మధ్య ఈ అంకెల్లో మార్పులు ఉంటాయి. రైడర్‌కు సంబంధించిన ఇతర నియమ నిబంధనలను కూడా బీమా కంపెనీ ముందుగానే తెలియజేస్తుంది. ఎటువంటి ఉత్పత్తులపై ఈ రైడర్‌ను

పొందవచ్చో బీమా కంపెనీ ముందస్తుగా తెలియజేస్తుంది. అలాగే రైడర్ ప్రయోజనం వర్తించని మినహాయింపుల జాబితాను కూడా బీమా కంపెనీ ముందుగా తెలియజేస్తుంది.

## B3 E: బీమా కంపెనీలు అందించే ఇతర రైడర్‌లు

బీమా కంపెనీలు అందించే ఇతర రైడర్‌లు ఏమనగా:

సర్జికల్ కేర్ రైడర్: బీమా చేసిన వ్యక్తి మెదడు, గుండె, ఊపిరితిత్తులు, కాలేయం మొదలగు అవయవాలకు జరిగే సర్జరీల ఖర్చులను ఈ రైడర్ భరిస్తుంది. ఈ రైడర్‌ను ఎంపిక చేసుకునే సమయంలో పేర్కొన్న ప్రత్యేక నియమ నిబంధనలకు లోబడి మాత్రమే ఇది పనిచేస్తుంది.

ఆస్పత్రి చికిత్స రైడర్: పాలసీదారుడు ఆస్పత్రిపాలైతే అందుకు అయ్యే ఖర్చులను కొన్ని నియమ నిబంధనలకు లోబడి ఈ రైడర్ చెల్లిస్తుంది. ఈ రైడర్ కింద చెల్లింపులను రెండు రకాలుగా చేయవచ్చు. బీమా కంపెనీ మొత్తం ఆస్పత్రి ఖర్చులను (రైడర్ నిబంధనల్లో పేర్కొన్నట్లుగా) చెల్లించవచ్చు. లేదా పాలసీదారుడు ఆస్పత్రిలో ఉన్న రోజులన్నింటికీ బీమా కంపెనీ రోజువారి నిర్దిష్ట మొత్తాన్ని చెల్లించవచ్చు. ఒకవేళ పాలసీదారుడు ఐసీయూలో చేరాల్సి వస్తే బీమా కంపెనీ రోజువారిగా అదనపు మొత్తాన్ని చెల్లించవచ్చు. అయితే ఈ విషయంలో బీమా కంపెనీలు అనుసరించే పద్ధతులు వేర్వేరుగా ఉంటాయి.

గ్యారంటీడ్ బీమా సామర్థ్య రైడర్: పెళ్లి, పిల్లల పుట్టుక, యింటి కొనుగోలు వంటి వివిధ జీవిత సందర్భాలకు అనుగుణంగా పాలసీదారుడు బీమా మొత్తాన్ని పెంచుకునేందుకు ఈ రైడర్ అవకాశం కల్పిస్తుంది.

## B4 రైడర్‌ల లక్షణాలు మరియు ప్రయోజనాలు

**రైడర్‌ల లక్షణాలు మరియు ప్రయోజనాలు**:

- అదనపు రక్షణ: రైడర్‌లను కలుపుకోవడం ద్వారా పాలసీదారుడు అధిక రక్షణను కొనుగోలు చేయవచ్చు. బీమా పరిధి, విలువ పెంచడంలో రైడర్‌లు దోహదపడతాయి.

- నామమాత్రపు వ్యయం: కొత్త పాలసీని కొనుగోలు చేయడంతో పోలిస్తే రైడర్‌లు నామమాత్రపు ఖర్చుతో అందుబాటులోకి వస్తాయి. ఉదాహరణకు, ఒకవేళ ఎండోమెంట్ పథకం తీసుకోవాలనుకునే వ్యక్తి తన డెత్

కవర్‌ను పెంచుకోవాలనుకుంటే ఇందుకోసం ప్రత్యేక బీమా పథకం తీసుకోవాల్సిన అవసరం లేకుండా నామమాత్రపు ఖర్చుతో టర్మ్ రైడర్‌ను పాలసీకి జత చేసుకోవచ్చు.

- కస్టమర్ కోరుకున్నట్లుగా బీమా పాలసీ రూపకల్పన: ఆరోగ్య బీమా పాలసీ కస్టమర్లు కోరుకునేలా ఉంచడంలో రైడర్‌లు దోహదపడతాయి. బీమా కంపెనీలు కూడా చిన్నవిగా ఉండే సాధారణ పాలసీలను అందించడంతోపాటు క్లయింట్ సూచించేలా రైడర్‌లను కలుపుకునేందుకు వీలవడంతో సంతృప్తి చెందుతాయి.

- చిన్నవిగా ఉండే సాధారణ పాలసీలను అందించడం బీమా కంపెనీలకు సులువుగా ఉంటుంది. దీనికి రైడర్స్ ను ఎంపిక చేసుకునే సౌలభ్యం కూడా ఉంటుంది. ఒక్కో పథకాన్ని ఐదు లేదా అంతకన్నా ఎక్కువ రైడర్స్ తో తీసుకోవచ్చు. ఐదు సాధారణ పథకాలు మరియు ఏడు రైడర్స్ కలిపి 35 లేదా అంతకన్నా ఎక్కువ ఎంపిక అవకాశాలు కల్పిస్తాయి.

- సులభంగా మార్చుకోగలగడం: పాలసీదారుడి సూచన మేరకు చాలా రైడర్స్ ను చేర్చుకోవడం లేదా తొలగించడం చేయవచ్చు.

- పన్ను ప్రయోజనాలు: రైడర్స్ పై చెల్లించే ప్రీమియంనకు ఆదాయపు పన్ను చట్టంలోని పన్ను చెల్లించ వలసిన ఆదాయం నుంచి మినహాయింపు పొందవచ్చు.

## <u>రైడర్స్ పై ఐఆర్‌డీఏ నియంత్రణలు</u>

2002 ఏప్రిల్‌లో జారీ చేసిన, 2002 అక్టోబర్‌లో సవరించిన ఐఆర్‌డీఏ నియంత్రణల ప్రకారం:

- టర్మ్ లేదా సామూహిక బీమా పాలసీల్లో ఆరోగ్యం లేదా తీవ్ర అనారోగ్యానికి సంబంధించిన అన్ని రకాల రైడర్స్ పై ప్రీమియం మూల పాలసీ ప్రీమియంలో 100%కి మించరాదు

- ఇతర రైడర్‌లన్నింటి ప్రీమియం మొత్తం కూడా మూల పాలసీపై 30% ప్రీమియంకన్నా మించరాదు.

- ఒక్కో రైడర్ ద్వారా అందే ప్రయోజనాలు మూల పాలసీపై చేసిన బీమా మొత్తాన్ని మించకూడదు.

ఈ నియంత్రణలతో రైడర్‌ల సంఖ్యపై ఐఆర్‌డీఏ పరిమితి విధించింది. ఈ పరిమితులను సమయానుగుణంగా సవరించే అవకాశం ఉంది.

## B5 యాన్యుటీలు

యాన్యుటీలకు, సాధారణంగా జీవిత బీమాకు మధ్య తేడా ఉంది. జీవిత బీమా కాంట్రాక్టులో, బీమా చేసిన వ్యక్తి మరణిస్తే బీమా కంపెనీ చెల్లింపులు ప్రారంభిస్తుంది. అయితే యాన్యుటీ కాంట్రాక్టులో యాన్యుటెంట్(యాన్యుటీ తీసుకున్న వ్యక్తి) మరణిస్తే బీమా కంపెనీ సాధారణంగా చెల్లింపులు నిలిపేస్తుంది.

జీవిత బీమా కంపెనీల ద్వారా యాన్యుటీలను కొనుగోలు చేస్తారు. వాటిని ఏక మొత్తం చెల్లింపు (సింగిల్ ప్రీమియం) ద్వారా కొనుగోలు చేయవచ్చు లేదా కొన్ని సంవత్సరాలపాటు చేసే క్రమం తప్పని చెల్లింపుల ద్వారా కొనుగోలు చేయవచ్చు. యాన్యుటెంట్ లేదా యాన్యుటీని కొనుగోలు చేసే యాన్యుటెంట్ యజమాని లేదా, ఇతర వ్యక్తిగత లబ్ధిదారు లేదా పెన్షన్ పథకం చెల్లింపులు చేయవచ్చు.

యాన్యుటీ అంటే దాన్ని అందించే వారి(బీమా కంపెనీ) నుంచి వ్యక్తి (యాన్యుటెంట్)కి లభించే క్రమం తప్పని చెల్లింపులు.

యాన్యుటీలు తక్షణ లేదా వాయిదా యాన్యుటీలుగా ఉంటాయి.

తక్షణ యాన్యుటీలు: భారీ మొత్తంతో వీటిని కొనుగోలు చేసిన వెంటనే బీమా కంపెనీలు తక్షణ యాన్యుటీలను చెల్లించాల్సి ఉంటుంది. యాన్యుటీ చెల్లింపులు నెల, మూడు నెలలు, ఆరు నెలలు లేదా ఏడాది చివర్లో ప్రారంభమవుతాయి. వాయిదా యాన్యుటీలు, ముందుగా అనగా సంవత్సరం మొదట్లో ముందుగా చెల్లించబడతాయి. వాయిదా యాన్యుటీలను చెల్లింపు తేదీలకు ముందుగా కొన్నేళ్లపాటు వాయిదాల్లో కొనుగోలు చేయవచ్చు.

### ఉదాహరణ

వెస్టింగ్ (చెల్లింపు)

అజయ్ 40 ఏళ్ల వయస్సులో బీమా కంపెనీకి రూ. 10 లక్షల భారీ మొత్తం చెల్లించి రిటైర్‌మెంట్ పథకం కొనుగోలు చేశాడు.

తన రిటైర్‌మెంట్ అయ్యాక యాన్యుటీ చెల్లింపులు అందుకోవాలని అజయ్ కోరుకున్నాడు. అంటే 60 సంవత్సరాల వయసులో యాన్యుటీ చెల్లింపు వరకు ఉన్న సమయాన్ని వెస్టింగ్ అంటారు.

ఈ మధ్యలో ఉండే 20 సంవత్సరాల కాలంలో [రిటైర్మెంట్ వయస్సు 60 సంవత్సరాలు (-) ప్రస్తుత వయస్సు 40సంవత్సరాలు] అజయ్‌కు బదులుగా బీమా కంపెనీ భారీ మొత్తంలో పెట్టుబడిపెట్టి దానిపై లాభాలు ఆర్జిస్తుంది. అజయ్ రిటైరయ్యాక అప్పటివరకూ కూడబెట్టిన  సొమ్మంతా అతనికి నిరంతర యాన్యుటీని చెల్లించేందుకు ఉపయోగిస్తుంది.

రిటైర్‌మెంట్ వయస్సును సాధారణం గా  వెస్టింగ్ తేదీ గా ఎంచుకుంటారు. ఎందుకంటే యాన్యుటీ చెల్లింపులను పాలసీదారులు, సాధారణంగా  ఆ తేదీ నుంచే కోరుకుంటారు.

వెస్టింగ్ సమయంలో అదే బీమా కంపెనీ నుంచి పెన్షన్ పథకం తీసుకోవాలా లేదా తనకు నచ్చిన మరో కంపెనీ నుంచి తీసుకోవాలా అనే విషయాన్ని అజయ్ నిర్ణయించుకోవచ్చు. బీమా కంపెనీని ఎంపిక చేసుకునే ఈ ఐచ్ఛికతను ఓపెన్ మార్కెట్ ఆప్షన్ అంటారు.

వెస్టింగ్ సమయంలో ఎటువంటి యాన్యుటీ పథకాన్ని తీసుకోవచ్చో ఎంపిక చేసుకునే అవకాశం అజయ్‌కు ఉంటుంది.

ఎంపిక చేసుకున్న యాన్యుటీ రకం మరియు వెస్టింగ్ సమయంలో ఉండే వాటి రేట్ల ఆధారంగా యాన్యుటీ చెల్లింపు ఉంటుంది.

ఆచరణలో చాలా రకాలు అందుబాటులో ఉన్నాయి. వాటికి కొన్ని ఉదాహరణలు:

## B5 A జీవితకాల ఫించను

ఈ పేరు సూచిస్తున్నట్లుగానే ఈ రకం ఫించన్ లో బీమా కంపెనీ నుంచి యాన్యుటెంట్ తన జీవితాంతం యాన్యుటీ చెల్లింపులను అందుకుంటాడు. యాన్యుటెంట్ మరణంతో ఈ చెల్లింపులు నిలిచిపోతాయి.

ఉదాహరణకు, ఒకవేళ సంజయ్ జీవితకాల ఫించను పథకం కొనుగోలు చేస్తే అప్పుడు అతను మరణించే వరకూ బీమా కంపెనీ నుండి నిరంతరం ఫించన్  చెల్లింపులు అందుకుంటూనే ఉంటాడు.

**గమనించ వలసిన అంశం** :

పెన్షన్ కొనుగోలుకు సంబంధించిన సొమ్ముతో జీవిత ఫించన్లను (తక్షణ మరియు వాయిదా) కొనుగోలు చేస్తుంటారు. దీనిని ఇతర అవసరాలకు (మరిన్ని వివరాల కోసం కింద ఉన్న సెక్షన్ బి6 చూడండి) ఉపయోగించడం కుదరదు.

## B5 B హామీకాల యాన్యుటీ

ఈ రకం యాన్యుటీలో యాన్యుటెంట్, యాన్యుటీ చెల్లింపును అందుకునేందుకు తాను జీవించి ఉంటాడా లేదా అనే అంశంతో నిమిత్తం లేకుండా కనీస స్థిర సంవత్సరాలను ఉదాహరణకు 5, 10, 15, మరియు 20 లేదా 25 సంవత్సరాలుగా ఎంచుకోవచ్చు. నిర్ణీత కాలవ్యవధిలో యాన్యుటెంట్ మరణిస్తే మిగిలిన కాలానికి యాన్యుటీ వాయిదాలు అతని తరఫున అతని లబ్ధిదారులకు అందుతాయి. ఒకవేళ హామీకాలం పూర్తయిన తర్వాత కూడా యాన్యుటెంట్ జీవించి ఉంటే అతను మరణించే వరకూ చెల్లింపులు కొనసాగించాల్సి ఉంటుంది.

## B5 C ఉమ్మడి జీవిత, చివరి సర్వైవర్ యాన్యుటీ(చివరకు మిగిలిన వ్యక్తులకు ఫించను)

ఈ రకం యాన్యుటీలో సాధారణంగా ఇద్దరు యాన్యుటెంట్లు ఉంటారు. ఉదాహరణకు భార్యాభర్తలు. ఈ యాన్యుటీ ప్రకారం భార్యాభర్తల్లో ఒకరి మరణం తర్వాత (ఎవరు ముందు మరణించారన్న దాంతో నిమిత్తం లేకుండా) మిగిలిన జీవిత భాగస్వామి తన జీవితాంతం వరకూ అదే స్థాయిలో యాన్యుటీ చెల్లింపు పొందుతారు. అంటే వారిద్దరూ జీవించి ఉన్నప్పుడు చెల్లించిన యాన్యుటీకి 100%గా ఒక్కరు జీవించివునప్పుడు కూడా అందుకుంటారు.

యాన్యుటీలోని మరో రకం ఏమిటంటే యాన్యుటెంట్‌కు తన జీవితకాలంలో మరియు జీవిత భాగస్వామి మరణానంతరం కూడా (ఉదాహరణకు, యాన్యుటీ చెల్లింపులు తక్కువ శాతంతో అందుతాయి.) ఉదాహరణకు, వాస్తవిక యాన్యుటీ మొత్తంలో 25%, 50% లేదా 75% అందుతుంది. ఈ రకమైన యాన్యుటీలో మొదటి యాన్యుటెంట్ జీవించి ఉన్నంతకాలం 100% స్థాయిలో చెల్లింపులు అందుతాయి. ఒకవేళ మొదటి యాన్యుటెంట్ మరణించాక వారి జీవిత భాగస్వామి జీవించిఉంటే పాలసీలో పేర్కొన్నట్లుగా ఆ భాగస్వామి మరణించే వరకూ తక్కువ శాతంలో యాన్యుటీలు అందుకుంటారు.

ఉదాహరణకు సంజయ్ మరియు ఆయన భార్య శీతల్ ఉమ్మడి యాన్యుటీని ఎంపిక చేసుకున్నారు. ఈ కేసులో సంజయ్ తన జీవితాంతం బీమా కంపెనీ నుండి యాన్యుటీ చెల్లింపులు అందుకుంటూనే ఉంటాడు. సంజయ్ మరణం తర్వాత కూడా శీతల్‌కు కూడా జీవితాంతం తగ్గించిన యాన్యుటీ చెల్లింపులు అందుతాయి. శీతల్ మరణం తర్వాత యాన్యుటీ చెల్లింపులు నిలిచిపోతాయి. ఒకవేళ సంజయ్‌కన్నా ముందు శీతల్ మరణిస్తే అప్పుడు సంజయ్ మరణం తర్వాత యాన్యుటీ చెల్లింపులు నిలిచిపోతాయి.

## B5 D జీవితకాలపు ఫించను పిదప కొనుగోలు ధరను తిరిగి పొందడం

ఈ రకమైన యాన్యుటీలో యాన్యుటెంట్ తన జీవితాంతం క్రమం తప్పకుండా యాన్యుటీ చెల్లింపులు అందుకుంటాడు. యాన్యుటెంట్ మరణం తర్వాత వాస్తవిక కొనుగోలు ధర నామినీ/లబ్ధిదారునకు అందుతుంది. పరిస్థితులనుబట్టి ఇక్కడ కొనుగోలు ధర అంటే సంచిత దశలోని పెట్టుబడి విలువ (ఈ సొమ్ముతోనే యాన్యుటీని కొనుగోలు చేశారు) లేదా యాన్యుటీ కొనుగోలు సమయంలో చెల్లించే భారీ మొత్తం.

## B5 E పెరుగుతుండే యాన్యుటీ

ఈ రకమైన యాన్యుటీలో నియమాలు పైన పేర్కొన్న వాటి లాగానే ఉంటాయి. అయితే ఏటా స్థిరమైన శాతం లేదా ముందుగా ఆమోదించిన ద్రవ్యోల్బణ సూచీ ఆధారంగా యాన్యుటీ పెరుగుతుంటుంది.

## B6 పెన్షన్ పథకాలు

వ్యక్తులు మరియు వారిపై ఆధారపడినవారు పెన్షన్ ప్రయోజనాలు పొందేందుకు చేసే పొదుపు మరియు పెట్టుబడి పథకాలనే పెన్షన్ పథకాలు అంటారు. పెన్షన్ పథకంలోకి ఒకసారి చెల్లింపులు చేస్తే రిటైర్‌మెంట్ లేదా ఆకస్మిక మరణం వరకూ వానిని తీయడం సాధ్యపడదు. వాటిని రుణాలు తీర్చేందుకు లేదా కొత్త కారు కొనుగోలు చేసేందుకు విత్‌డ్రా చేయడం కుదరదు. పెన్షన్ పథకాలను ఉద్యోగ యాజమాన్యాలు లేదా ప్రైవేటు వ్యక్తులు (స్వీయ లబ్ధి కోసం) కూడా అందించవచ్చు.

| **రిటైర్‌మెంట్‌తో మొదలయ్యే జీవిత యాన్యుటీయే రిటైర్‌మెంట్ పెన్షన్ పథకం** | |
|---|---|
| పెన్షన్ పథకాల లక్షణాలు మరియు ప్రయోజనాలు | |
| సంచిత దశ / పెట్టుబడి దశ | పెన్షన్ పథకంలో రెండు దశలు ఉన్నాయి. సంచిత దశ/పెట్టుబడి దశ మరియు క్రమం తప్పని యాన్యుటీ దశ. సంచిత దశలో ఓ వ్యక్తి తన ఉద్యోగ జీవితంలో నిరంతర చెల్లింపులు లేదా భారీ మొత్తంలో చేసే చెల్లింపులను బీమా కంపెనీ అతని తరఫున పెట్టుబడిగా పెడుతుంది. |
| క్రమం తప్పని యాన్యుటీ దశ: | సంచిత దశలో జమ అయిన నిధిని ఓ వ్యక్తి రిటైరయ్యాక అదే బీమా |

| | |
|---|---|
| | కంపెనీ నుండి యాన్యుటీ పథకం కొనుగోలు చేసేందుకు ఉపయోగించవచ్చు లేదా మరో కంపెనీ నుంచి కొనుగోలు చేయవచ్చు. సంచిత నిధితోపాటు రిటైర్‌మెంట్ ప్రయోజనాలుగా అందే ప్రావిడెండ్ ఫండ్ సొమ్ము, గ్రాట్యుటీ, సూపర్‌యాన్యుయేషన్ లేదా ప్రజా ప్రావిడెండ్ నిధి, ఇతర పెట్టుబడుల ద్వారా అందే సొమ్మును ఓ వ్యక్తి యాన్యుటీ పథకం కొనుగోలు చేసేందుకు ఉపయోగించవచ్చు. క్రమం తప్పని యాన్యుటీ దశలో ఒక వ్యక్తి బదులుగా బీమా కంపెనీ భారీ మొత్తంలో పెట్టుబడి పెట్టి, ఆపై ఆ వ్యక్తి(యాన్యుటెంట్)కి నిరంతర/కాలానుగుణ యాన్యుటీ చెల్లింపులు చేస్తుంది. |
| కమ్యుటేషన్: | క్రమం తప్పని/కాలానుగుణ యాన్యుటీ చెల్లింపులు అందుకునే ముందు ఒక వ్యక్తి భారీ మొత్తంలో విత్‌డ్రా చేసుకోవచ్చు. దీన్నే కమ్యూటేషన్ అంటారు. బీమా కంపెనీలు సాధారణంగా సంచిత నిధిలో నుండి మూడో వంతు సొమ్మును విత్‌డ్రా చేసుకునేందుకు అనుమతిస్తాయి. మిగిలిన రెండు వంతుల నిధిని యాన్యుటీ చెల్లింపుల కొనుగోలుకు ఉపయోగించాలి. |
| చెల్లింపు వ్యవధి: | రిటైర్‌మెంట్ నిధి కొరకు సంచిత దశలో ఓ వ్యక్తి నెలవారీ/త్రైమాసిక/ద్వైవార్షిక/వార్షిక పద్ధతిలో పెట్టుబడులు పెట్టవచ్చు. అలాగే రిటైర్‌మెంట్ నిధిలో ఏక మొత్తంలో కూడా పెట్టుబడిగా పెట్టవచ్చు. యాన్యుటీని కొనుగోలు చేసే సమయంలో ఒక వ్యక్తి తాను అందుకోవాల్సిన యాన్యుటీ చెల్లింపులను నెలవారీ/త్రైమాసిక/ద్వైవార్షిక/వార్షిక పద్ధతుల్లో అందుకోవచ్చు. అత్యధిక ప్రజలు నెలవారీ యాన్యుటీ విధానాన్ని ఎంచుకుంటారు. |
| బీమా ప్రయోజనం: | యాన్యుటీ పథకాలు లేదా పెన్షన్ పథకాలు క్రమం తప్పని యాన్యుటీ దశలో ఎటువంటి బీమా అందించవు. అలాగే యాన్యుటెంట్ మరణిస్తే హామీకాలం లేకపోతే చెల్లింపులు నిలిచిపోతాయి. మరింత సమాచారం |

| | |
|---|---|
| | కోసం సెక్షన్ బి5బి చూడండి. |
| పన్ను ప్రభావాలు: | ప్రస్తుతమున్న ఆదాయ పన్ను చట్టాల ప్రకారం సంచిత దశలో పెన్షన్ పథకాలపై పెట్టే నిర్దేశిత మొత్తాల వార్షిక పెట్టుబడులు ఆదాయపుపన్ను చట్టంలోని పన్ను విధించాల్సిన ఆదాయం క్రింద మినహాయింపు పొందేందుకు అర్హత కలిగి ఉంటాయి. అలాగే వీటిపై మూడో వంతు విత్‌డ్రా సొమ్ముపై కూడా పన్ను చెల్లించాల్సిన అవసరంలేదు. ఓ వ్యక్తి క్రమం తప్పని యాన్యుటీ లేదా పెన్షన్ అందుకుంటే దానిపై ఆ వ్యక్తికి వర్తించే పన్ను శ్లాబ్ మరియు పన్ను రేటు కింద పన్ను విధించవచ్చు. |
| చెల్లింపు కాల వ్యవధి: | బీమా కంపెనీకి ఓ వ్యక్తి భారీ మొత్తంలో సొమ్ము చెల్లించవచ్చు లేదా సంచిత దశలో దశలవారీ చెల్లింపుల విధానాన్ని ఎంపిక చేసుకోవచ్చు. |
| సంప్రదాయ/యూనిట్ ఆధారిత: | సంచిత దశలో సంప్రదాయ పెన్షన్ పథకంలో లేదా యూనిట్ ఆధారిత పెన్షన్ పథకంలో నష్టభయం ఆధారంగా ఓ వ్యక్తి పెట్టుబడి పెట్టవచ్చు. సంప్రదాయ పెన్షన్ పథకం అధిక మొత్తం నిధులను ప్రభుత్వ సెక్యూరిటీల్లో పెట్టుబడి పెడుతుంది. అదే యూనిట్ ఆధారిత రిటైర్‌మెంట్ పథకంలో మాత్రం వ్యక్తి సూచించే ఈక్విటీ నిధి, రుణ నిధి లేదా అందుబాటులో ఉండే ఇతర నిధుల్లో పెట్టుబడి పెడుతుంది. |
| చెల్లింపులో రకాలు: | క్రమం తప్పని యాన్యుటీ దశలో కొన్ని యాన్యుటీలు యాన్యుటెంట్‌కు స్థిర చెల్లింపులు చేస్తాయి. మరికొన్ని మాత్రం యాన్యుటీ చెల్లింపులను నిర్ణీత శాతం మేరకు పెంచడం లేదా ద్రవ్యోల్బణ సూచీ మొత్తం ఆధారంగా చెల్లింపులు చేస్తాయి. |
| 2010 సెప్టెంబర్ 1 నుంచి అమల్లోకి వచ్చిన ఐఆర్‌డీఏ నిబంధనల ప్రకారం అన్ని యూనిట్ ఆధారిత పెన్షన్ పథకాలపై బీమా కంపెనీలు కనీసం 4.5% రిటర్న్‌లు (ఒకవేళ అన్ని ప్రీమియములు చెల్లిస్తే) ఇవ్వాలి. సంచిత కాలంలో ఎటువంటి | |

పాక్షిక ఉపసంహరణలను కూడా అనుమతించరు.

## C పన్నులు మరియు ఆర్థిక ఉత్పత్తులపై ద్రవ్యోల్బణ ప్రభావం :

**గమనిక**: కొత్త ప్రత్యక్ష పన్నుల కోడ్ (డీటీసీ)ను ఏప్రిల్ 1, 2012 నుంచి అమల్లోకి తీసుకురావాలని 2011 ఆర్థిక బిల్లులో ప్రభుత్వం నిర్ణయించింది. ఈ విధానం వల్ల అన్ని బీమా పాలసీలపై పన్నుల విధింపులో మార్పు చోటుచేసుకోవచ్చు. ఒక గుర్తింపు పొందిన ఏజెంటుగా మారే ముందు మీరు ఈ పరిణామాల గురించిన సమాచారం తెలుసుకోవాల్సిన అవసరం ఉంది.

## C1 ఆర్థిక సేవలపై పన్నుల ప్రభావం

- ఆరోగ్య బీమా పథకాలు: ప్రస్తుతమున్న ఆదాయ పన్ను చట్టాల ప్రకారం, బీమా పథకాలపై ఒక స్థాయి ప్రీమియం చెల్లింపు వరకూ ఆదాయపు పన్ను చట్టంలోని సెక్షన్ల కింద పన్ను మినహాయింపు పొందవచ్చు. ఒకవేళ పాలసీదారుడు సీనియర్ సిటిజన్ (65 ఏళ్లు పైబడిన వ్యక్తి) అయితే ఇతరులకన్నా ఎక్కువగా పన్ను మినహాయింపు పొందవచ్చు.
- రైడర్స్: బీమా రైడర్స్ కోసం చెల్లించే ప్రీమియం ఆదాయపు పన్ను చట్టంలోని సెక్షన్ల కింద మినహాయింపు పొందేందుకు అర్హత కలిగి ఉంటుంది.
- పెన్షన్ పథకం: సంచిత దశలో పెన్షన్ పథకాలపై ఓ స్థాయి ప్రీమియం చెల్లింపుల వరకూ ఆదాయపు పన్ను చట్టంలోని సెక్షన్ల కింద మినహాయింపు పొందేందుకు అవకాశం ఉంది. సంచిత దశలో పాలసీదారుడు మూడో వంతు సొమ్మును విత్‌డ్రా చేసుకోవచ్చు. అయితే క్రమం తప్పకుండా పాలసీదారుడు అందుకునే యాన్యుటీని ప్రభుత్వం ఆదాయంగా పరిగణించి దానిపై సంబంధిత చట్టాల కింద పన్ను వసూలు చేయవచ్చు.

## C2 ఆర్థిక ఉత్పత్తులపై ద్రవ్యోల్బణ ప్రభావం

బీమా మరియు ఇతర ఆర్థిక ఉత్పత్తులపై ద్రవ్యోల్బణం ఎటువంటి ప్రభావం చూపుతుందో మనం 5, 6 చాప్టర్లలో చూశాం. అలాగే గత కొన్ని సంవత్సరాల్లో భారీగా పెరిగిన ఆరోగ్యబీమా వ్యయంపై కూడా ద్రవ్యోల్బణం ప్రభావం చూపుతుంది. అంటే ప్రస్తుతం తీసుకున్న ఆరోగ్య బీమా ఒక దశాబ్దం తర్వాత అప్పటి అవసరాలకు చాలకపోవచ్చు. అయితే బీమా మొత్తాన్ని పెంచుకునేందుకు కొన్ని బీమా కంపెనీలు అనుమతిస్తాయి. అందువల్ల ద్రవ్యోల్బణం ప్రభావాలను దృష్టిలో ఉంచుకొని పాలసీదారుడు నిరంతరం తన ఆరోగ్య బీమాను సమీక్షించుకోవాలి.

జీవన ప్రమాణాలపై ద్రవ్యోల్బణం ప్రభావాలు తీవ్రంగా ఉంటాయి. రిటైరయ్యే వ్యక్తులు ఇతర ఆదాయ వనరులు లేక ఇబ్బందిపడాల్సి వస్తుంది. అందువల్ల ద్రవ్యోల్బణాన్ని దృష్టిలో ఉంచుకొని తమ ఖర్చులు ఏటా పెరుగుతాయని భావిస్తూ అందుకు తగ్గ పదవీవిరమణ పథకాన్ని ఎంచుకోవాలి. కొన్ని పదవీవిరమణ పథకాలు ఏటా యాన్యుటీ చెల్లింపును స్థిరమైన శాతం ద్వారా పెంచుతాయి.

| |
|---|
| **ప్రశ్న 7.3 :** **కమ్యుటేషన్ అంటే ఏమిటి?** |

## D. అవసరాలను ప్రాధాన్య క్రమంలో గుర్తించి అందుకు ఆర్థిక సేవలను వినియోగించుకోవడం :

కుటుంబంలో సంపాదించే వ్యక్తి తీవ్ర అనారోగ్యానికి గురై కొన్ని రోజులపాటు ఆస్పత్రిలో చేరాల్సి వస్తే అది ఆ కుటుంబ ఆర్థిక పరిస్థితిపై రెండు రకాలుగా ప్రభావం చూపుతుంది. మొదటగా ఆస్పత్రి ఖర్చులు చెల్లించేందుకు ఇతర అవసరాల కోసం దాచుకున్న సొమ్మును ఆ కుటుంబం ఖర్చు చేయాల్సి రావచ్చు. అదేవిధంగా ఆర్జించే వ్యక్తి ఆస్పత్రిపాలవడం కుటుంబ ఆదాయానికి నష్టం కలిగిస్తుంది. ఒక్కోసారి పరిస్థితులు అనుకూలంగా లేకపోతే ఆస్పత్రి బిల్లులు చెల్లించేందుకు వ్యక్తిగత రుణాలు కూడా తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. దీనివల్ల కుటుంబంపై ఒకవైపు ఆర్థిక భారం పెరిగితే మరోవైపు అందుకు అవసరమైన ఆదాయం అందుబాటులో ఉండని పరిస్థితి నెలకొంటుంది. ఇలాంటి పరిస్థితుల నుంచి కుటుంబాలను గట్టెక్కించడంలో ఆరోగ్య బీమా పథకాలు దోహదపడతాయి. అందువల్ల ప్రతి వ్యక్తి ఆరోగ్య బీమాను ప్రధానమైన అవసరంగా గుర్తించాలి.

కుటుంబంలో సంపాదించే వ్యక్తి వ్యక్తిగత జీవిత బీమా పథకం తీసుకొని వుంటే ఆ వెంటనే ఆరోగ్య బీమా తీసుకునే విషయాన్ని కూడా పరిశీలించాలి. అలాగే జీవిత బీమాపై అదనపు ప్రయోజనం పొందేందుకు యాక్సిడెంటల్ డెత్ బెనిఫిట్ రైడర్ లేదా ప్రత్యేక యాక్సిడెంట్ పాలసీ తీసుకోవాలి. కుటుంబ సభ్యులందరికీ ఆరోగ్య బీమా కల్పించాలనుకుంటే

వారి పేరిట వ్యక్తిగత ఆరోగ్య బీమా పథకాలకన్నా ఫ్యామిలీ ఫ్లోటర్ పథకం తీసుకోవడం మంచిది. ఫ్యామిలీ ఫ్లోటర్ పథకంలో కుటుంబ సభ్యులంతా బీమా మొత్తాన్ని ఎటువంటి ప్రత్యేక నిష్పత్తులు లేకుండా పంచుకోవచ్చు.

మనం ముందుగా చర్చించుకున్నట్లు, చాలా మంది తమ రిటైర్‌మెంట్ అవసరాలకన్నా పిల్లల చదువు, పెళ్లిళ్ల ప్రణాళికలకు అధిక ప్రాధాన్యం ఇస్తారు. ఇలాంటి పరిస్థితుల్లో ఒక వృత్తిపరమైన జీవిత బీమా ఏజెంట్ తన క్లయింట్స్‌ను వీలైనంత వరకు పెన్షన్ పథకాల్లో స్వల్ప మొత్తాల్లోనైనా పొదుపు చేసేలా ప్రోత్సహించాలి.

## స్థూలంగా

జీవిత బీమా ఏజెంట్లు తెలుసుకోవాల్సిన వివిధ బీమా పథకాలపై చేసిన అధ్యయనాన్ని పరిశీలించాం. వయసు పెరిగేకొద్దీ ఏర్పడే అవసరాలు, ఉదాహరణకి, వృద్ధాప్యంలో అనారోగ్యం పాలైనప్పుడు ఆర్థికంగా దోహదపడే ఆరోగ్య బీమా పథకాలు, రైడర్స్, యాన్యుటీల గురించి తెలుసుకున్నాం. అలాగే అనారోగ్యానికి గురైన సమయంలో సరైన ఆర్థిక వనరులు లేకపోతే ఎదురయ్యే పరిస్థితుల గురించి కూడా మనం తెలుసుకున్నాం.

తరువాత పేజీల్లోకి వెళ్లబోయే ముందు చాప్టర్ 5లోని సెక్షన్ డి, చాప్టర్ 6లోని సెక్షన్ జిలోని అంశాలను మరోసారి చదవండి. ఈ చాప్టర్ల ద్వారా పొందిన విజ్ఞానం, క్లయింట్ల అవసరాలను గుర్తించడంలో ఎలా దోహదపడుతుందో, వారు సరైన జీవిత బీమా పథకాలు గుర్తించడంలో ఎలా సహాయపడగలుగుతుందో తెలుసుకోండి.

తదుపరి చాప్టర్‌లో మనం క్లయింట్ల అవసరాలను ప్రాధాన్య క్రమంలో గుర్తించే అంశాన్ని పరిశీలిద్దాం. ప్రత్యేకించి మీ క్లయింట్ ప్రస్తుత ఆర్థిక పరిస్థితిలోనే ఈ అవసరాలను ఎలా గుర్తించవచ్చో చూద్దాం. అలాగే మీరిచ్చే సలహాలపై ఎటువంటి ప్రభావాలు ఉంటాయో తెలుసుకుందాం.

## కీలకాంశాలు

### ఇతర ఆర్థిక అవసరాలు

ఒక వ్యక్తి ఇతర ఆర్థిక అవసరాల్లో ఆరోగ్య బీమా, బీమా రైడర్స్, రిటైర్‌మెంట్ పథకాలు ఉంటాయి.

- ఆరోగ్య బీమా వల్ల కుటుంబానికి ఆరోగ్య భద్రత లభిస్తుంది. ఆస్పత్రి ఖర్చులను దీని నుంచి చెల్లించవచ్చు. డాక్టర్ల ఫీజులు, మందులు, గది అద్దె మరియు వైద్యానికి సంబంధించిన ఇతర ఖర్చులు లాంటివి.
- బీమా రైడర్స్ తక్కువ ఖర్చుతో మరింత అదనపు ప్రయోజనాలను కలిగిస్తాయి.

- రిటైర్‌మెంట్ తర్వాత కూడా మంచి జీవితాన్ని గడిపేందుకు రిటైర్‌మెంట్ బీమా పథకం ఉపయోగపడుతుంది.

**<u>ఇతర కీలక పథకాల లక్షణాలు, ప్రయోజనాలు</u>**

- ఇతర కారణాలు స్థిరంగా ఉన్నాయని భావించినా, ఆరోగ్య బీమా పథకంలో వయసు పెరిగేకొద్దీ ప్రీమియం పెరుగుతుంది.
- బీమా పథకాల వల్ల నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో సొమ్ము చెల్లించాల్సిన అవసరం లేకుండా చికిత్స తీసుకోవచ్చు. అలాగే నాన్ నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకున్నాక ఆస్పత్రి ఖర్చులను తొలుత చెల్లించి రీయింబర్స్ మెంట్ ద్వారా ఆ సొమ్మును తిరిగి బీమా కంపెనీ నుండి పొందవచ్చు.
- బీమా సొమ్ము, బీమా కవరేజి / పెరుగుదలకు రైడర్స్ ఉపయోగపడతాయి.
- పెన్షన్ పథకాల్లో రెండు దశలు ఉంటాయి: పాలసీదారుడు మొత్తం ఒకేసారి ప్రీమియం చెల్లించే దశ, బీమా కంపెనీ పాలసీదారుడికి క్రమం తప్పకుండా చెల్లించే యాన్యుటీ దశ.
- రిటైర్‌మెంట్ పథకంలో చెల్లించే ప్రీమియములు ఆదాయపుపన్ను నుండి మినహాయింపు పొందేందుకు అర్హత కలిగి ఉంటాయి. అయితే పాలసీదారుడికి క్రమం తప్పకుండా అందే యాన్యుటీలు మాత్రం ఆదాయ పన్ను పరిధిలోకి వస్తాయి.
- నగదు చెల్లింపు కాలం, చెల్లించే పద్ధతి, దాని వల్ల లబ్ధి పొందే వ్యక్తుల ఆధారంగా యాన్యుటీలను విభజించవచ్చు.

**<u>వివిధ రకాల ఆర్థిక ఉత్పత్తులు</u>**

- ఆరోగ్య బీమా పథకం ముఖ్యంగా నాలుగు రకాలుగా ఉంటుంది. వ్యక్తిగత బీమా పథకం, ఫ్యామిలీ ఫ్లోటర్ బీమా పథకం, సామూహిక ఆరోగ్య బీమా, ఆస్పత్రిపాలైతే రోజు నగదు ప్రయోజనం ఉండే బీమా.
- ఏదైనా ప్రమాదంలో మరణం సంభవిస్తే బీమా చేసిన మొత్తంతోపాటు అదనపు సొమ్మును బీమా కంపెనీ చెల్లించేందుకు యాక్సిడెంటల్ డెత్ బెనిఫిట్ రైడర్ ఉపయోగపడుతుంది.
- పాలసీలో డెత్ కవర్ సొమ్మును పెంచేందుకు టర్మ్ రైడర్ ఉపయోగపడుతుంది.

- పాలసీదారుడు ఏదైనా తీవ్ర అనారోగ్యానికి గురైతే ఈ (C I) రైడర్ ద్వారా అనారోగ్యానికి అయ్యే వైద్య ఖర్చులను పొందవచ్చు.

- పాలసీదారుడు అంగవైకల్యానికి లోనైతే భవిష్యత్తు ప్రీమియాలు రద్దు చేసుకునేందుకు, ప్రీమియం చెల్లింపు రద్దు రైడర్ దోహదపడుతుంది.

- యాన్యుటీ పథకంలోని రకాలు: జీవిత కాలపు యాన్యుటీ, హామీకాల యాన్యుటీ, ఉమ్మడి జీవిత చివరి సర్వైవర్ యాన్యుటీ, జీవిత యాన్యుటీ (కొనుగోలు ధర నుండి మిగిలిన మొత్తాన్ని అందించే పథకం), పెరిగే యాన్యుటీ.

ఆర్థిక సేవలపై పన్నులు మరియు ద్రవ్యోల్బణ ప్రభావాలు

- ఆరోగ్య బీమా కోసం చెల్లించే ప్రీమియంపై కొంత మొత్తం వరకూ ఆదాయపు పన్ను చట్టంలోని సంబంధిత సెక్షన్ల నుండి మినహాయింపు పొందేందుకు అర్హత కలిగి ఉంటుంది.

- రిటైర్‌మెంట్ పథకంపై చెల్లించే ప్రీమియంపై ఆదాయపు పన్ను చట్టంలోని సంబంధిత సెక్షన్ల నుంచి మినహాయింపు లభిస్తుంది. అయితే పాలసీదారుడు అందుకునే పెన్షన్ సొమ్ము మాత్రం పన్ను పరిధిలోకి వస్తుంది.

- ప్రస్తుతానికి సరిగా అనిపించే ఆరోగ్య బీమా మొత్తం ద్రవ్యోల్బణ ప్రభావం కారణంగా, ఉదాహరణకు ఓ పది సంవత్సరాల తర్వాత అప్పటి పరిస్థితులకు తగినట్లుగా ఉండదు.

- ప్రాధాన్యత అవసరాలను గుర్తించి ఆ అవసరాలను తీర్చుకునేందుకు ఆర్థిక సేవలను పొందడం

- కుటుంబంలో సంపాదించే వ్యక్తి లేదా మరే ఇతర కుటుంబ సభ్యుడైనా అనారోగ్యం వల్ల ఆస్పత్రిపాలైతే అందుకు అయ్యే ఖర్చులను చెల్లించడంలో ఆరోగ్య బీమా పథకాలు దోహదపడతాయి.

- ఇతర ఆర్థిక లక్ష్యాలతో పోలిస్తే రిటైర్‌మెంట్ అవసరాలు అంత ప్రాధాన్యమైనవి కాకపోయినప్పటికీ వాటిని కూడా వ్యక్తులు అలక్ష్యం చేయకూడదు. స్వల్ప మొత్తంలో పొదుపు చేస్తూ కాలంగడిచేకొద్దీ ప్రీమియముల మొత్తాన్ని పెంచుకోవచ్చు.

**<u>ప్రశ్న జవాబులు</u>**

**<u>7.1</u>**

కొన్ని ఆరోగ్య బీమా పథకాల లక్షణాలు మరియు ప్రయోజనాలు:

- ధరను నిర్ణయించడం
- నగదు రహిత వైద్య సౌకర్యం
- వైద్య పరీక్షలు
- పాలసీ తీసుకునే నాటికి ఉన్న అనారోగ్యాలకు కూడా వర్తించే పథకాలు
- డబ్బు చెల్లించడం (కో పేమెంట్)
- నో క్లెయిమ్ బోనస్
- తక్షణ వైద్యం
- ఆదా చేసిన సొమ్ము నుండిగానీ లేదా రుణాల నుంచి భారీ మొత్తాలు చెల్లించాల్సిన అవసరంలేదు.

**7.2**

బీమా కంపెనీలు అందించే తీవ్ర అనారోగ్యాల జాబితాలో కంపెనీల మధ్య తేడాలు ఉంటాయి. తీవ్ర అనారోగ్య రైడర్ పరిధిలోకి వచ్చే జబ్బుల జాబితా:

1. గుండెజబ్బు

2. క్యాన్సర్

3. కిడ్నీ వైఫల్యం

4. అవయవ మార్పిడి

5. పక్షవాతం

6. అయోర్టా సర్జరీ

7. అంధత్వం

8. పారాప్లీజియా

9. కోమా

10. మల్టిపుల్ స్క్లెరోసిస్

**7.3**

కమ్యూటేషన్: యాన్యుటీలను క్రమం తప్పకుండా అందుకునే ముందు పాలసీదారుడు ఒకేసారి భారీ మొత్తంలో విత్‌డ్రా చేసుకోవచ్చు. దీన్నే కమ్యూటేషన్ అంటారు. సంచిత నిధిలో నుండి మూడో వంతు వరకూ పాలసీదారుడు విత్‌డ్రా చేసుకునేందుకు బీమా కంపెనీలు అనుమతిస్తాయి. మిగిలిన రెండు వంతులు మాత్రం పాలసీదారుడికి యాన్యుటీ చెల్లింపుల కోసం కొనుగోలు చేసేందుకు ఉపయోగించాలి.

## స్వీయ పరీక్ష ప్రశ్నలు

1. మార్కెట్‌లో అందుబాటులో ఉండే కొన్ని యాన్యుటీ పథకాల గురించి వివరించండి.

2. యాక్సిడెంటల్ డెత్ బెనిఫిట్ రైడర్ గురించి తెలపండి.

3. యాన్యుటీ పథకంలోని రెండు రకాలను వివరించండి.

**ఈ ప్రశ్నలకు జవాబులు పక్క పేజీలో చూడొచ్చు**

## <u>స్వీయ పరీక్షా ప్రశ్నలకు జవాబులు</u>

**1**. మార్కెట్‌లో అందుబాటులో ఉండే కొన్ని యాన్యుటీ పథకాలు ఇవీ:

- జీవిత కాలపు యాన్యుటీ
- హామీకాల యాన్యుటీ
- ఉమ్మడి జీవిత, చివరి సర్వైవర్ (జీవించే వ్యక్తి) యాన్యుటీ
- జీవిత యాన్యుటీ (కొనుగోలు ధరలో మిగిలిన మొత్తం తిరిగి చెల్లింపు)

**2**. బీమా చేసిన వ్యక్తి ప్రమాదంలో మరణిస్తే ఈ రైడర్ వల్ల సాధారణంగా చేసిన బీమా సొమ్ము కంటే అధిక మొత్తంలో సొమ్ము లభిస్తుంది. ఇది ఈ రైడర్‌లో ఉండే ప్రయోజనం. మరణం అనేది యాదృచ్ఛికంగా సంభవించి ఉండాలి తప్ప ఇతర కారణాలతో సంభవించి ఉండకూడదు. పాలసీలో పేర్కొన్న నియమ నిబంధనల ప్రకారం ఈ రైడర్‌లో సొమ్ము చెల్లించబడుతుంది.

భారతదేశంలో ప్రమాదాల్లో సంభవిస్తున్న మరణాలు అధికంగా ఉండటం వల్ల ఏడీబీ రైడర్ ఎంతో ప్రధానమైనది. ఎలాంటి బీమా పథకాలతో ఈ రైడర్ ప్రయోజనం లభిస్తుందో బీమా కంపెనీలు సూచిస్తాయి. అలాగే ఈ రైడర్ ప్రయోజనం వర్తించని మినహాయింపులను కూడా బీమా కంపెనీలు ముందుగానే వెల్లడిస్తాయి.

**3**. యాన్యుటీ పథకంలోని రెండు దశలు ఏమనగా సంచిత దశ, క్రమం తప్పని యాన్యుటీ దశ.

సంచిత దశ: ఈ పథకంలోని దశలో రెండు దశలు ఉంటాయి. సంచిత/పెట్టుబడి దశ మరియు క్రమం తప్పని యాన్యుటీ దశ. సంచిత దశలో పాలసీదారుడు తన ఉద్యోగ జీవితంలో క్రమం తప్పని మొత్తాల్లో లేదా ఏకమొత్తంలో సొమ్ము చెల్లిస్తాడు. ఆ మొత్తాన్ని బీమా కంపెనీ పెట్టుబడి పెడుతుంది.

క్రమం తప్పని యాన్యుటీ దశ: సంచిత దశలో పొదుపు చేసిన సొమ్మును పాలసీదారుడు రిటైర్ అయ్యాక అదే బీమా కంపెనీ నుండి యాన్యుటీ పథకం కొనుగోలు చేసేందుకు ఉపయోగించుకోవచ్చు, లేదా మరో బీమా కంపెనీ నుండి కూడా యాన్యుటీ పథకాన్ని కొనుగోలు చేయవచ్చు. సంచిత నిధితోపాటు ప్రావిడెంట్‌ఫండ్ సొమ్ము, గ్రాట్యుటీ, సూపర్‌యాన్యుయేషన్ రూపంలో అందుకునే సొమ్మును పాలసీదారుడు యాన్యుటీ పథకాన్ని కొనుగోలు చేసేందుకు ఉపయోగించవచ్చు. క్రమం తప్పని యాన్యుటీ దశలో బీమా కంపెనీ, పాలసీదారుడి తరఫున భారీ మొత్తం పెట్టుబడిగా పెట్టి ఆపై క్రమం తప్పకుండా పాలసీదారుడికి యాన్యుటీ చెల్లిస్తుంది.